క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై తస్మాత్...

సీతానగరం: మండలంలోని ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బూర్జ ఆయుష్ వైద్యాధికారిణి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. సీజనల్ వ్యాధులున్న లక్ష్మీపురంలో గురువారం ఆయుష్ ఉచిత వైద్య శిబిరాన్ని సిబ్బంది సహకారంతో నిర్వహించారు. ఈ మేరకు డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ సీజ్‌లో వచ్చే కీళ్ల వాపులు, కీళ్ల నొప్పులు, జ్వరాలు వస్తుంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది పద్మ, హరిప్రియ, లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు


వాహన తనిఖీలు చేపడుతున్న ఆర్టీవో సిబ్బంది

పార్వతీపురం టౌన్: ఓవర్ లోడ్ వాహనాలకు అపరాధ రుసుం విధిస్తామని జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గాప్రసాదరెడ్డి హెచ్చరించారు. జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.కాశీరాంనాయక్ ప్రత్యేక తనిఖీలు గురువారం నిర్వహించారు. పరిమితికి మించి అధిక ప్రయాణికులతో ప్రయాణించిన ఆటో రిక్షాలు, రహదారి భద్రత నియమాలు అతిక్రమించిన 22 వాహనాలపై కేసులు పెట్టారు. రెండు వాహనాలను సీజ్ చేసినట్టు చెప్పారు. వీటి నుంచి రూ.65 వేలు అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించి పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటించాలని తెలిపారు.

చెక్కుల అందజేత


లబ్ధిదారులకు పీఎంజేజేవై చెక్కులు అందజేస్తున్న ఏపీజీవీబీ బీఎం

పాచిపెంట : మండలంలోని కేసలి పంచాయతీలో కేసలి, యారడ్లవలస గ్రామాల్లో ఏపీజీవీబీ బ్యాంకు ద్వారా పీఎంజేజేవై పథకం ద్వారా రూ. రెండు లక్షల చొప్పున గురువారం ఇద్దరికి చెక్కులు పంపిణీ చేశారు. యారడ్లవలస గ్రామంలో బోయన పెంటయ్య మృతి చెందడంతో ఆయన భార్య బోయిన వెంకటమ్మకు, అలాగే కేసలి గ్రామంలో అక్కుల మంజుల మృతి చెందడంతో ఆమె భర్త అక్కుల వెంకటరమణకు బ్రాంచ్ మేనేజర్ పీవీ సునీల్‌కుమార్‌కు రూ. రెండు లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వీవో గోపమ్మ, బ్రాంచ్ సీఎస్ పి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సాలూరు కమిషనర్ బాధ్యతల స్వీకరణ


కమిషనర్ రత్నకుమార్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు, సిబ్బంది

సాలూరు: మున్సిపల్ కమిషనర్‌గా రత్నకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. కమిషనర్‌ను మున్సిపల్‌క కార్యాలయ సిబ్బంది, అధికారులు అభినందించారు.

అధ్యాపకుల నిరసన

సాలూరు: తమ సమస్యలు పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు తెలిపారు. గత నాలుగు నెలలుగా సాధారణ బదిలీలు మరియు ఇతర సమస్యలపై ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో అధ్యాపకులు నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. సాధారణ బదిలీలు నిర్వహించని పక్షంలో, జీసీటీఏ, జీసీజీటీఏ సంఘాల పిలుపు మేరకు ఈనెల 18న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే సాధారణ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కార్యదర్శులకు సన్మానం

సీతానగరం: ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు ఉద్యోగ విరమణలు సహజమే అయినా విధి నిర్వాహణలో వారందించిన సేవలు ప్రజల్లో ఉండి పోతాయని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన వారికి ఎంపీడీవో ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శుల సంఘం మండల శాఖ సత్కరించింది. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో వెంకటరమణ, అధికార సిబ్బంది రామినాయుడు, ప్రసాద్, దేవి కార్యదర్శులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పార్వతీపురం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పార్వతీపురం ఐటీడీఏలో విద్యార్థులకు గిరిజన సంస్కృతి, ఆచారాలు తదితర అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించి ఈ పోటీలలో విజేతలకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేయనున్నట్టు ఏపీవో మురళీధర్ తెలిపారు.

ఎరువుల కొరత తీరేదెన్నడో..!

- అధిక ధరలకు ప్రైవేటు వ్యాపారుల విక్రయాలు
- రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్న రైతులు


పొలంలో ఎరువు చల్లుతున్న రైతు (ఫైల్)

పార్వతీపురం రూరల్:

అన్నం పెట్టే అన్నదాత పంట పొలాల సాగుకు అవసరమైన ఎరువులు ప్రస్తుత సీజన్‌లో అందడం లేదు. ఎరువుల కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎరువుల కొరత నేపథ్యంలో ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తూ దోచుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేలకు చేరేవి. ప్రస్తుతం ఆర్‌బీకేల స్థానంలో పేరు మార్చి రైతు సేవా కేంద్రాలు నిర్వీర్యంగా కూటమి పాలనలో మిగిలిపోతున్నాయి. ఈ కేంద్రాలకు అంతంతమాత్రంగా వస్తున్న ఎరువులను అధికార పార్టీ నేతలే తన్నుకుపోతున్నారు. దీంతో ఎరువుల కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో జిల్లా స్థాయిలో పాలకులతో కలిసి అధికార యంత్రాంగం సాగుకు సంబంధించి ముందస్తు సమీక్షలు చేసి అవసరమైన చర్యలు చేపట్టేవారు. నేడు ఆ పరిస్థితుల్లేవు. ఇప్పటికే ఉభాలు దశకు కూలీలకు డబ్బులు వెచ్చించి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ప్రభుత్వం ఎరువులు సరఫరా సక్రమంగా లేక వ్యాపారులను ఆశ్రయిస్తే యూరియా రూ.450, డీఏపీ రూ.1600 చొప్పున బ్లాక్ మార్కెట్‌లో గుట్టు చప్పుడు కాకుండా అవసరాన్ని ఆసరాగా తీసుకొని విక్రయాలు చేస్తున్నారు.

మండలంలో ఇలా..

మండలంలోని సంగంవలస, బాలగుడబ, తాళ్లబురిడి, బందలుప్పి, డోకిశీల, జమదాలతోపాటు ఈ రైతు సేవా కేంద్రాల పరిధిలో వున్న రైతున్నలకు తీవ్ర స్థాయిలో ఎరువుల కొరత నెలకొంది. ఇప్పటికిప్పుడు అధికారులు స్పందించి ఎరువులు పంపిణీకి సిద్ధం చేసిన ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున ఇచ్చినా సుమారు 200టన్నుల ఎరువులు అవసరం ఉన్నాయి. రైతులు అత్యవసర పరిస్థితుల్లో బయట కొనుగోలు చేసేందుకు ఎరువుల దుకాణాలను ఆశ్రయిస్తే కొంతమంది వ్యాపారులు అదనంగా మరికొన్ని ఎరువులు కొనుగోలు చేస్తేనే యూరియా లేదా డీఏపీ లాంటివి అమ్మకాలు చేస్తామని బాహాటంగా చెబుతున్నారు.

దృష్టి సారిస్తున్నాం...



రైతు సేవా కేంద్రాల ద్వారా మండలంలోని ఎరువు కొరత లేకుండా పంపిణీ చేసేందుకు నిల్వలు పంపిస్తున్నాం. అలాగే పంపిణీ జరిగిన వివరాలు తీసుకుంటున్నాం. ఎరువుల కొరత ఎక్కడైనా ఉంటే మా దృష్టికి వస్తే నిల్వలు పంపించేందుకు చర్యలు తీసుకుంటాం.

– అశోక్, ఏవో

ఓటమి భయంతోనే టీడీపీ అరాచకం

- నేడు జిల్లా కేంద్రంలో నిరసన
- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం రూరల్: వైఎస్సార్ కడప జిల్లా స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ఓడిపోతామని భయంతోనే టీడీపీ దాడికి పాల్పడిందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈవీఎంల టాంపరింగ్‌తో అధికారంలోకి వచ్చిన టీడీపీకి ప్రజా క్షేత్రంలో భయం మొదలయ్యిందన్నారు. గడిచిన 14నెలల్లో చంద్రబాబు పతనం స్పష్టంగా ప్రజల్లో కన్పిస్తుందని, మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సమయం కోసం వేచి చూస్తున్నారన్నారు. రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఏ కార్యక్రమాన్ని అయినా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి అరాచక పాలనను సృష్టిస్తున్నారన్నారు. అధికార దాహంతో దాడులకు పాల్పడి పదవులను చేజిక్కుంచుకోవాలనే ఉద్దేశంతో వరుస దాడులకు పాల్పడుతున్నారన్నారు.

నేడు నిరసన

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాలు జరిపిన దాడిని ఖండిస్తూ శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో బెలగాం చర్చివీధి రోడ్డు, ఎస్ఎన్‌పీ కాలనీలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వమే బస్సులు కొనుగోలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జోనల్ అధ్యక్షుడు

పార్వతీపురం టౌన్: ఉచిత బస్సు పథకానికి సరిపడినన్ని బస్సులు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జోనల్ అధ్యక్షుడు ఎంసిహెచ్.అప్పడు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో గురువారం నిర్వహించిన ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు సిబ్బంది నియామకాలు చేపట్టాలని, ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరానికి తగిన బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, అదనపు సిబ్బంది నియమించాలని డిమాండ్ చేశారు. ఈ ఉచిత బస్సు పథకం వలన మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున ఆర్టీసీ సిబ్బంది పై పని భారం కూడా పెరుగుతుందని పెరుగుతున్న పని భారానికి తగిన విధంగా సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రజా రవాణా అత్యంత అవసరమని ప్రజా రవాణా విస్తృతం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సంస్థకు చెందిన ఆస్తులను, భూములను ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్యదర్శి వి.రాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, పార్వతీపురం డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎస్ రావు, ఏఎస్‌టీ బాబు, కార్యవర్గ సభ్యులు ఎస్‌వీ రమణ, టి.వెంకటి, బి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తెరవాలని నిరసన


మూతపడి ఉన్న పాఠశాల వద్ద నిరసన

పాచిపెంట : చదువుకునే విద్యార్థులు ఉన్నప్పటికీ కూడా పాఠశాలలు మూసి వేయడమేనా... కూటమి ప్రభుత్వం విద్యకు వేస్తున్న పెద్దపీట... అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు ప్రశ్నించారు. మండలంలోని గరిసిగుడ్డి గ్రామంలో మూసివేసి ఉన్న జీపీఎస్(టీడబ్ల్యూ) పాఠశాల వద్ద స్థానిక గ్రామస్తులతో కలిసి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలకు విద్య అందని ద్రాక్షగా మిగిలిపోతుంది అన్నారు. గ్రామంలో పాఠశాల భవనంతో పాటు చదువుకునే పిల్లలు ఉన్నప్పటికీ కూడా ఉపాధ్యాయులు లేక స్కూల్స్ ప్రారంభం నాటి నుంచి నేటి వరకు తెరుచుకోలేదన్నారు. ఇక్కడ ఉన్న పిల్లలు తల్లిదండ్రులతో పాటు ఆవులకు పోడు వ్యవసాయ పనులకు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో విద్యను నిర్వీర్యం చేస్తుందన్నారు. కలెక్టర్ తక్షణమే స్పందించి ఉపాధ్యాయులు లేక మూతపడి ఉన్న జీపీఎస్(టీడబ్ల్యూ) పాఠశాలలను తక్షణమే తెరిపించి గిరిజన విద్యార్థులకు విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో సకూరు పండయ్య, సెబి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ గ్రామానికి ఏమైంది..!

పార్వతీపురం రూరల్: ఆ గ్రామంలో వరుస మరణాలు ప్రజలను భయపెడుతున్నాయి. పది రోజుల వ్యవధిలో వివిధ కారణాలతో ఏడుగురు మృత్యువాత పడ్డారు. ఇందులో వయసు మీరిన వారు.. మధ్య వయస్కులు, యువకులు ఉన్నారు. ఆ గ్రామమే నర్సిపురం. గ్రామానికి చెందిన పలువురు వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారిలో ఇటీవల హైదరాబాద్‌లో బతుకు తెరువు రీత్యా ఉంటున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఒకే రోజు గ్రామంలో వయసు రీత్యా ఇద్దరు, మధ్య వయస్కులు ఒకరు మృతి చెందారు. ఈ క్రమంలో పది రోజుల వ్యవధిలో ఎక్కువగా మరణాలు సంభవిస్తుండడంతో ఆ గ్రామ ప్రజల్లో ఒక రకమైన భయాందోళనలు నెలకొన్నాయి. వరుస మరణాలతో గ్రామానికి చేరుకుంటున్న బంధువులు, స్నేహితులు ఈ గ్రామానికి ఏమైందంటూ చర్చించుకుంటున్నారు. భయాందోళనలతో ఉన్న గ్రామస్తులు తమ ఇంటి దేవతలను, గ్రామ దేవతలకు మొక్కుకుంటున్నారు.

అనుమతులు ఉండాలి


ఏజెన్సీ రహదారుల్లో తనిఖీలు చేస్తున్న సీఐ, ఎస్ఐ తదితరులు

పాలకొండ రూరల్: అనుమతులు లేకుండా తుపాకులు, నాటు తుపాకులు కలిగి ఉండటం, ఉపయోగించటం చట్టరీత్యా నేరమని పాలకొండ సీఐ మీసాల చంద్రమౌళి అన్నారు. తమ శాఖ జిల్లా అధికారులు ఆదేశాలతో సర్కిల్ పరిధిలో కార్డన్ సెర్చ్ ద్వారా ప్రత్యేక డ్రైవ్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో దోనుబాయి, బత్తిలి, సీతంపేట, వీరఘట్టం, పాలకొండ స్టేషన్ల ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలు, గత అనుభవాలు, ఈ తరహా తుపాకులు వినియోగంపై నిఘా కొనసాగుతుందన్నారు. ఏవరైనా అనధికారంగా వీటిని కలిగి ఉంటే స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించాలన్నారు. తమ ద్వారా పట్టుబడితే కఠినమైన కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు ఏజెన్సీ రహదారుల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇకపై క్షేత్ర స్థాయిలో లోతైన తనిఖీలు విస్తృతం చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్ఐ కె.ప్రయోగమూర్తి, సిబ్బంది ఉన్నారు.

హెల్త్‌కార్డులో విద్యార్థుల ఆరోగ్య వివరాలు

పార్వతీపురం రూరల్: విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి ప్రతీ విద్యార్థి ఆరోగ్య వివరాలను సంబంధిత హెల్త్‌కార్డులో స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా ఆర్‌బీఎస్‌కె పీవో డా. జగన్మోహన్‌రావు అన్నారు. గురువారం పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ మేరకు హెల్త్ స్క్రీనింగ్ వివరాలపై వైద్య సిబ్బందిని ఆరాతీశారు. అలాగే డీవార్మింగ్ కార్యక్రమ సన్నద్ధతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీ మియాలిజిస్టు డా. కె.కౌశిక్, వైద్యాధికారి డా.పీఎల్ గోపాలకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులు అభివృద్ధి చెందాలి


నారాయణపురంలో చేనేత కార్మికురాలిని సన్మానిస్తున్న ఏడీవో

బలిజిపేట: చేనేత కార్మికులు వృత్తి నైపుణ్యంలో మరింత రాణించి అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పార్వతీపురం మన్యం జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీవో వెంకటరమణ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నారాయణపురంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మిక కుటుంబాలకు ఈ నెల నుంచి 200యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జీఎస్టీ ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అనంతరం చేనేత కార్మికురాలు కాలేపు లక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో డిజైనర్ ప్రసాదు, సీడీ జగదీష్, మాజీ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు సిహెచ్.నారాయణరావు, కె.గౌరీశ్వరరావు, కె.అప్పారావు, కె.వీర్రాజు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి


చిలకలపల్లి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

బలిజిపేట: స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. చిలకలపల్లి సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో రైతులు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.వేణు, బి.భానుమూర్తి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. స్మార్ట్ మీటర్లను ప్రజలపై బలవంతంగా రుద్దుతుందన్నారు. బలిజిపేట మండలంలో సుమారు 760స్మార్ట్ మీటర్లను అమర్చిందన్నారు. వెంటనే వీటిని రద్దు చేయాలని లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీసా వెంకటస్వామి, ఎస్.ఈశ్వరరావు, నారాయణరావు, శివ, వెంకటేష్, యమ్మల మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

సారా నివారణకు చర్యలు

సాలూరు: నవోదయం కార్యక్రమంలో భాగంగా సాలూరు స్టేషన్ పరిధిలో సారా కేసుల్లో 33 మందిని అరెస్ట్ చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దాసు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, స్టేషన్ పరిధిలో సారా, అక్రమ మద్యం విక్రయాల నివారణకు కృషి చేశామని తెలిపారు. సారా తయారీ స్థావరాలపై దాడులు చేశామని, సారా రవాణాను అడ్డుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 200 లీటర్లు సారా సీజ్ చేసామని, 4800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. 168 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. బైండోవర్‌లో ఉండి నల్లబెల్లం అమ్ముతున్న ఒకరిని అరెస్ట్ చేసినట్టు చెప్పారు. పాత కేసుల్లో ఉన్న 80 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు.

కొత్త జియో ప్రామాణికంగా యాప్‌లు వినియోగించాలి


మాట్లాడుతున్న జేఈ సోమేశ్వరరావు

సీతానగరం: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం అమలు చేస్తున్న కొత్త పథకాలపై అవగాహన కల్పించడానికి శిక్షణ దోహద పడుతుందని ఉపాధి పథకం జేఈ సోమేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బలిజిపేట, సీతానగరం మండలాలకు చెందిన టెక్నికల్ పర్సన్స్‌తో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏపీవో బాలకృష్ణ, బలిజిపేట ఏపీవో కేశవరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. జేఈ సోమేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా డ్వామా పీడీ ఆదేశాల మేరకు క్లస్టర్ స్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహించి పథకం రూపొందించిన యాప్‌లు, స్ట్రక్చరల్, జియోట్యాగింగ్, జియో ఫెన్సింగ్, ఈకేవైసీ, ఫేస్ ప్రామాణికాన్ని వినియోగించే విధానం పట్ల శిక్షణ పొందిన టీఏటీలు, టీఏలు సాంకేతిక సహాయకులు క్షేత్ర స్థాయిలోని రెండు మండలాల్లో వివరించాలని కోరారు. బలిజిపేట, సీతానగరం మండలాల ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

‘భోజన’ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శాంతికుమారి డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో మధ్యాహ్న భోజన నిర్వహకుల మండల మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త మెనూ అమలు చేయమని మధ్యాహ్న భోజన కార్మికులపై ఒత్తిడి చేస్తుందన్నారు. మెను చార్జీలు పెంచకుండా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయకుండా పైగా వాళ్ల సమస్యలు పరిష్కారం చేయకుండా, మండలానికి ఒక చోట వంట నిర్వహించి విద్యార్థులకు భోజనం పంపిణీ చేసే ఆలోచన చేస్తున్నారన్నారు. 20 ఏళ్లుగా ఈ పథకంలో పనిచేస్తున్న వారికి వేతనం కేవలం రూ.3000 చెల్లించి శ్రమదోపిడికి రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. ఇప్పటికైనా నిర్వాహకులకు కనీస వేతనాలు చెల్లించి, ఉపాధికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10వ తేదీన పార్వతీపురంలో జరిగే మధ్యాహ్న భోజన నిర్వహకుల జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బొంకురు సూరిబాబు, కో కన్వీనర్ బి.లక్ష్మి, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్వతీపురం మండల అధ్యక్షులుగా జి.తులసి, కార్యదర్శిగా వెంకటమ్మతో పాటు కమిటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

కాంట్రాక్ట్ కార్మికుల పీఎఫ్ బకాయిలు చెల్లించాలి


జిల్లా ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల పీఎఫ్ బకాయిలు చెల్లించాలని మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుగత అశోక్ డిమాండ్ చేశారు. మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వి.ఎస్.కుమార్ నేతృత్వంలో మన్యం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో ఉన్న పేషెంట్లకి ఇబ్బంది కలగకుండా, ప్రాణాలు లెక్కచేయకుండా పనులు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు జీవితాలను ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న కాంట్రాక్ట్ దళారీ వ్యవస్థ చేతుల్లో పెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ వ్యవహార శైలి కూడా అలాగే ఉందని విమర్శించారు. నేటి పాలకులు ఉద్యోగులను తొలగించడంలో శ్రద్ధ చూపుతున్నారని ధ్వజమెత్తారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారించే వరకు దశల వారీగా పోరాటా లు కొనసాగిస్తామని బుగత అశోక్ హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మన్యం జిల్లా కార్యవర్గ సభ్యు లు ఈవీ నాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి దుర్గారావు, యూనియన్ జిల్లా అధ్యక్షురా లు అలజంగి కుమారమ్మ, నాయకులు మజ్జి చంద్రమౌళి, సంచాన శంకరరావు ఆసుపత్రిలో పని చేస్తు న్న పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

పుర పాలనను చక్కదిద్దాలి

పార్వతీపురం టౌన్: ఇప్పటికైనా పార్వతీపురం పుర పాలనను చక్కదిద్దాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. గ్రేడ్ వన్ మున్సిపాలిటీ అయిన పార్వతీపురం మున్సిపాలిటీకి ఆ స్థాయి మున్సిపల్ కమిషనర్ నియమించాలని కోరారు. ప్రభుత్వం అర్హత కలిగినటువంటి వ్యక్తినే మున్సిపల్ కమిషనర్‌గా నియమించాలని కోరారు. మున్సిపల్ కుళాయిల తాగునీరు స్వచ్ఛంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. దశాబ్దాలుగా వేధిస్తున్న డంపింగ్ యార్డ్ మార్పు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు మంచి పాలన అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో వీధులతో పాటు కాలువల్లో మురుగు పేరుకు పోయిందన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీశంకరరావు, జిల్లా నాయకులు కోల కిరణ్ ఉన్నారు.

గిరిజనులకు అన్యాయం జరిగితే న్యాయపోరాటం చేస్తాం..

సాలూరు: గిరిజనులకు అన్యాయం జరిగితే హైకోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తామని ప్రముఖ న్యాయవాది రేగు మహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి సమీపంలో ఉన్న విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం కొట్టక్కి రెవెన్యూ పంచాయతీలో ఎమ్ఎస్ఎమ్ఈ పార్కు ఏర్పాటు కోసమని ప్రభుత్వం, అక్కడ గిరిజనులు సాగు చేస్తున్న భూమిని తీసుకునే ప్రయత్నం చేయరాదన్నారు. ఈ పార్కుకు గుర్తించిన ప్రాంతంలో కొందరు గిరిజనేతరులు ఆక్రమించి సాగు చేస్తున్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నా తమకేం అభ్యంతరం లేదన్నారు. బొబ్బిలిలో గ్రోత్ సెంటర్ కోసం తీసుకున్న భూమికి ఇప్పటివరకు ఎటువంటి పారిశ్రామిక అభివృద్ధి జరగలేదన్నారు. గిరిజనులు జీవనాధారంగా సాగు చేస్తున్న ఈ భూముల విషయంలో ప్రభుత్వం తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు విన్నవించినట్టు పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం హైకోర్టును ఆశ్రయించడానికి సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు.



